

కమలకి పెళ్లివారు వచ్చారు. పెళ్లి కొడుకు ఇంజనీరు. ఆరొందలు జీతం. కుటుంబం, మంచి చెడ్డా అన్నీ బాగానే వున్నాయి. పెళ్లికొడుక్కి కమల నచ్చింది. అంతవరకు అన్నీ బాగానే వున్నాయి.

కాని... పెళ్లివారు కట్నం ఎనిమిదివేలు, లాంఛనాలు మరో రెండువేలు కావాలని రాయగానే సూర్యనారాయణగారి గుండె గుభేలుమంది.

కట్నం పదివేలు, ఎంత హీనపక్షంచూసు కున్నా పెళ్లిఖర్చు మరో అయిదారువేలు మొత్తం పదిహేను వేలు!! ఎక్కడనించి తేవడం?

నీళ్లుకారి పోయారు ఉత్తరం చదివి ఆయన.

"మరి యీసంబంధం మనకి లాభంలేదే. పదిహేనువేలు ఎక్కడనించి తేను, నాతాహ తుకి మించినద్కైనా ఏ ఐదారు వేలో కట్నం యిచ్చి చేద్దామనుకున్నాను, పిల్ల సుఖ పడుతుందనుకున్నాను.... కాని వీళ్లు మరీ యింతలా తాడిచెట్టెక్కి కూర్చుంటారను కోలేదు.." నిస్పృహగా భార్యతో అన్నా రాయన.

"ఏమిటండీ అంతలా అధైర్యపడతారు యివాళ యీచేత్తో యిస్తే రేపాచేత్తో కొడుక్కి పుచ్చుకోరా ఏమిటి... ప్రస్తుతం ఏ అప్పో సప్పో చేస్తే....మళ్లీ ఏడాదికి రామానికి పెళ్లిచేసి ఆవచ్చిన కట్నం అప్పు క్రింద చెల్లగట్టచ్చు" జానకమ్మ మహా నమ్మకంగా, మహాధైర్యంగా అంది.

ఆడదానికున్నపాటి తెగువ, ధైర్యం సూర్య నారాయణగారికి లేక ఆఉద్దేశాన్ని అంతలా ఆమోదించలేక పోయారు. "బాగుందే ఎప్పుడో వాడికి కట్నం వస్తుందని ముందు యింత డబ్బు అప్పుచేసి పెళ్లిచెయ్యనా... యింతకీ వాడికి కట్నం వస్తుందని నమ్మకం ఏమిటి?" సందిగ్ధంగా అన్నారు.

"బాగుంది మీ అనుమానం, మగాడన్న వాడికి నాలుగైదువేలు కట్నంయిస్తున్నారు. మనవాడికేమండి, రేపో మాపో డాక్టరవుతాడు కళ్లకద్దుకుని యిరవై వేలన్నా యిస్తారు.." గర్వంగా అంది ఆవిడ.

"ఏమోనుమా పోనీ ఇదొక్కర్తే పిల్లగనకా అప్పోసప్పో చేసి చేయడానికి, మరొకర్తెవుంది, చదువుకి మరోడువున్నాడు ఒక్కర్తికే యింత ఖర్చుపెట్టడం......"

"అబ్బ, అన్నింటికి అంత బెంగపడా రేమిటి...మరొకర్తెవుంటే మరోడుమాత్రం

లేదా ఏమిటి.. వాడికి వచ్చిన కట్నం దానికి సరిపోతుంది. మీరిలా ఆలోచిస్తూ కూర్చుని సంబంధం కాస్తా చేయిజారి పోనీకండి.... అన్నీ కుదిరాయి, మంచి సంబంధం......"

"ఇంత డబ్బు అప్పు ఎక్కడనించి తేవడం, ప్రావిడెంటుఫండ్‌లోంచి, మారేజి లోను నించి కొంత తీసుకుంటాననుకో. అయినా ఇంకా పదిహేను వేలవదు అదంతా కలిపినా..." సందిగ్ధంగా అన్నాడాయన.

"ఎక్కడో అక్కడ డబ్బు అప్పుపుట్టదా ఏమిటి, అన్నింటికీ నాన్చుడే మీకు..' కసురుకుంటూ అంది జానకమ్మ.

వెనకాముందాడుతున్న సూర్యనారాయణ గార్ని పోరి పోరి అప్పు చేయడానికి ఆఖరికి ఒప్పించింది ఆవిడ.

తల్లితండ్రుల సంభాషణ అంతా వింటున్న రామం ఏదో చెప్పాలనుకుని ఆరాటపడ్డాడు కాని, చెప్పలేక పోయాడు. అతనికళ్ళ ముందు రాధ కన్పించింది. తర్వాత స్కూలు మేస్టరు గిరీ చేస్తున్నరాధ తండ్రి కనిపించాడు.. ఆతర్వాత తల్లితండ్రులుతననించి ఆశించే పదిహేనువేలరూపాయలు అతని కళ్ళముందు కదలాడాయి....ఎంత ప్రయత్నించినా ఆరోజు తను చెప్పాలనుకున్నది చెప్పలేక పోయాడు రామం.

* *

సూర్యనారాయణగారు తన తాహతుకి మించినదైనా, ..అనుకున్న దానికంటె మరో వెయ్యి పదిహేను వందలు ఖర్చయినా కూతురి పెళ్ళి నిర్విఘ్నంగా జరిపించేశారు. కొడుకు పెళ్ళికి వచ్చే డబ్బుమీద ఆయనకు చాలా నమ్మకం వుండడంవల్ల జరిగిన ఖర్చుకి అంత బాధపడలేదు. ఆడబ్బు యీ అప్పు చెల్లగట్టడానికి సరిపోతుంది. మరో పిల్ల పెళ్ళికి మరో పదేళ్ళలోపల తొందర లేదు. ఈలోగా కాలుచెయ్యి కూడదీసుకోవచ్చు. భార్య చెప్పినట్టు, మరో కొడుకు వుండనే వున్నాడు.. ఆయన నిబ్బరం అది!

సూర్యనారాయణగారు రెండొందల జీతంతో చేరి ప్రస్తుతం ఏదో కంపెనీలో ఆరొందల జీతం తెచ్చుకుంటున్నారు. పిల్లలు నలుగురే కావడం వల్ల ఏదో పెద్దగా కాకపోయినా దేనికీ లోటు లేకుండా క్షేమంగా సంసారం సాగించారు యిన్నాళ్ళూ. జీతం రాళ్ళ ఆధారం అయినా వున్న వూళ్ళో చదవడం, స్వతహాగా రామం తెలివితేటలు గలవాడడంవల్ల స్కాలర్‌షిప్పులతోనే అతని చదువు అంతా అయింది. అంచేతే కొడుక్కి మెడిసన్ చెప్పించ గలిగాడాయన. కూతురికి యీరోజుల ప్రకారం బి.ఏ. చెప్పించారు. యీ కరువు రోజుల్లో వచ్చే జీతం నిత్యావసరాలకి మాత్రం సరిపోయే కాలంలో కట్నాలు కానుకలు యిచ్చే పాటి డబ్బు ఆయనకి లేకపోయినా కొడుకు మెడిసన్ డిగ్రీ చూసుకుని కూతురిమీద నిబ్బరంగా పదిహేనువేలు ఖర్చు చేయగలిగాడాయన.

రామం చదువయింది. సంబంధాలు బాగానే వస్తున్నాయి! ప్రస్తుతం సూర్యనారాయణ దంపతుల దృష్టి అంతా కొడుకు తేబోయే కట్నం మీదే కేంద్రీకృతమయింది.

* *

ఆనాడు చెప్పలేకపోయిన సంగతి మరో ఏడాదికి ఉద్యోగస్థుడు కాంగానే చెప్పక తప్పలేదు రామానికి.

చెప్పింతర్వాత కొన్ని క్షణాలు ఆయింట్లో భయంకర నిశబ్దం తాండవించింది. రాబోయే ప్రళయాన్ని ఎదుర్కోనడానికి సిద్ధంగానే గదిలో కూర్చుని ఎదురు చూస్తున్నాడు రామం.

కొడుకు చెప్పిన మాట విన్నాక నోట మాటలేకుండా కొన్ని క్షణాలు భార్యభర్తలిద్దరూ అలా వుండి పోయారు. ఆ ఆశ్చర్యంనించి తేరుకున్నాక సూర్యనారాయణగారు నిప్పులు చెరిగే కళ్లతో కొడుకు గదివంక చూశారు. ఆయన కోపం కాసేపటికి ఎదురుగావున్న భార్య మీదకి తిరిగింది. తీక్ష్ణంగా జానకమ్మ వంక చూశారు.

"ఏం అలా బెల్లంకొట్టిన రాయిలా కూర్చున్నావు. మాట్లాడవేం....'విన్నావుగా నీకొడుకు నిర్వాకం, చూశావా నీకొడుకు ప్రయోజకత్వం... ఆరోజు నాకొడుకున్నాడు, మూటలు తెస్తాడని మురిసావు.. కొడుకున్నాడు మనకేమిటని మహా గర్వంగా కబుర్లు చెప్పావు. పదిహేనువేలు అప్పు చెయించావు ఆకొడుకుని చూసుకుని... యిప్పుడు ఆకొడుకు దమ్మిడీ తేననిచెప్తూంటే నోరు మూసుకుని కూర్చున్నావేం!" కోపంగా అరిచాడాయన.

"బాగుంది, నేనేం చేస్తాను. వాడిలా చేస్తాడని నేననుకున్నానా' హీనస్వరంతో అంది జానకమ్మ.

"అవును ఎందుకనుకుంటావు! కొడుకున్నాడు ఉద్ధరిస్తాడు. వూరేగిస్తాడని మురిసావు... నీవు నమ్మావు..నన్ను ముంచావు. నేనే గాడిదని. కాకపోతే యీ రోజుల్లో కొడుకులు తండ్రులని ఆదుకుంటారని ఆశించడం ఏమిటి? ఆదుకోవాల్సిన అవసరం వాళ్ళకి ఏమిటి? తల్లితండ్రుల కష్టనిష్ఠూరాలు వాళ్ళకెందుకు?... ఏడ్చి నమ్మి..ఏడ్చినమ్మి..." కోపంతోమరి ఆయన నోటమాట పైకి రాలేదు.

"బాగుంది, నామీద ఎగురుతారేమిటి? కూతురికి మంచి సంబంధం చేయాలని మీకుమాత్రం లేదా ఏమిటి? కట్నాలు పొయ్యందే కాస్తో కూస్తో మంచి సంబంధాలు ఎలా వస్తాయి? సరే, కొడుకున్నాడు, వాడి పెళ్ళికి కట్నం రాదా అని అనుకున్నాం.. యిప్పుడు తప్పు నాదన్నట్టు మాట్లాడుతారేం....' జానకమ్మ తీక్ష్ణంగా అంది.

"తప్పు నీదీకాదు, వాడిదీ కాదు..నాది తప్పు! వాడూ బాగానే వుంటాడు..నీవూ బాగానే వుంటావు.. ఎటొచ్చి అప్పుచేసిన వాడిని నేను కదూ తీర్చాలి.... ఏంపెట్టి తీరుస్తాను.. నా శ్రాద్ధం పెట్టి...

"బాగున్నాయి మాటలు,.. వాడ్ని పిలిచి గట్టిగా నాలుగూ దులిపి అడగలేరా నామీద ఎందుకు యీ చాతకాని చిందులు"

"ఏమిటే అడిగేది.. చిన్నవాడా చితక వాడా? పాతికేళ్ళవాడు.... ఇంట్లో జరుగుతున్నది అమాత్రం తెలియకుండా వున్నాడా ఏమిటి? అన్నం తినడంలేదా? అమాత్రం బుద్ధి జ్ఞానం లేకుండా వున్నాడా .... మనిషయిన వాడికి యింకా ఏం విడమర్చి చెప్పాలి..."

గదిలోంచి వింటున్న రామానికి ఆవేశం వచ్చేసింది. చర చర గదిలోంచి వచ్చాడు. "మీరు ఏమన్నా అడగదల్చుకుంటే సూటిగా అడగండి, జవాబు చెపుతాను..ఈ డొంక తిరుగుడు నాకు నచ్చదు... నేనేదో కాని పని చేసినట్టు, ఏ ఖూనీనో చేసినట్టు యిందాకటినించి మాట్లాడుతున్నారు. నేనన్న దానిలో తప్పేంవుంది?" తీక్ష్ణంగా అడిగాడు.

"ఏమిటోయ్ చెప్పేది? నీ చెల్లెలిపెళ్ళి

ఏలా చేసినో నీకు మళ్ళీ ఇప్పుడు మరోసారి విడమర్చి చెప్పాలా ఏమిటి" సూర్యనారాయణగారూ కోపంగానే అన్నారు కొడుకువంక చూస్తూ.

"మీరు అప్పుచేసేముందు నన్నడిగి, నేను తీరుస్తానని మాటిచ్చాక చేసారా? మీ కూతురిపెళ్ళికి కావాలని అప్పుచేసుకున్నారు... దానికి ఇప్పుడు నన్ననడం ఏమిటి? ఇందులో నానేరం ఏమిటి?" తీవ్రంగానే అన్నాడు రామం.

"విన్నావటే..విన్నావటే..నా కూతురుట నా కూతురే కాని నీ చెల్లెలు కాదన్నమాట! నీకూతురిపెళ్ళి చేసుకున్నావు, నేనెందుకు ఆడబ్బు తీర్చాలంటున్నావు...మా భాగా బుద్ధి చెప్పావు నాయనా, చెంపదెబ్బ కొట్టినట్టు చెప్పావు. నిజం చెప్పావు, కొడుక్కి తండ్రి బరువు బాధ్యతలలో పాలుపంచుకోవాల్సిన అవసరం ఏం లేదని బాగా చెప్పావు... నిజమే నా కూతురికి పెళ్ళిచేశాను ఆడబ్బు తీర్చుకోడం నాపని...ఇంక నీనించి ఏం ఆశించినా నేనో వెధవతో సమానం ఇదే చెప్తున్నాను..." సూర్యనారాయణ గారు కోపంగా, పౌరుషంగా అన్నారు.

"మీరనవసరంగా అపోహ పడుతున్నారు. నేనన్నదల్లా కట్నం తీసుకోనన్నాను.. రాధని పెళ్ళాడుతానన్నాను..అంతేగాని నేను ఆర్థికంగా మిమ్మల్ని ఆదుకోనని అనలేదు, కొడుకుగా నాబాధ్యతల్ని విస్మరిస్తాననీ అనలేదు....కట్నం ఇచ్చి ఆడపిల్ల పెళ్ళి చేసి మీరు ఇంత అవస్థ పడుతూ కూడా మళ్ళీ మరో ఆడపిల్లనించి కట్నం ఎలా ఆశిస్తున్నారో నాకు అర్థంకావడం లేదు... నా పాయింటే అర్థం చేసికోకుండా అనవసరంగా......."

"ఏమిటోయి అర్థం చేసికోడం...మనం ఇచ్చాంగనకనే.. తీసుకోడం.. కూతుళ్ళకి కట్నాలు ఇస్తేగాని పెళ్ళికానప్పుడు, కొడుకులనించి తీసుకోడం తప్పా? ఆదర్శాలు పుచ్చుకునేటప్పుడే గాని, ఇచ్చేటప్పుడు మూలకి పోతున్నాయి....."

"ఈయడం మీతప్పు...ఇలా వేలుపెట్టి, అల్లుడిని కొనుక్కోడం...ఆడబ్బు కొడుకుల నించి రాబట్టాలనుకోడం...హు..ఈదేశం బాగుపడమంటే ఎందుకు పడుతుంది?.." వ్యంగ్యంగా అన్నాడు రామం.

"కట్నాలు ఈయక ఏంచేస్తాం?..

# కుక్క తోక

అందరూ తమలాంటి ఆదర్శ మూర్తులే వుండరు కనక డబ్బు పొయ్యాల్సివస్తోంది, పొయ్యందే మొగుడు దొరకడు కనక..' కోపంగా అన్నారు సూర్యనారాయణగారు.

"ఇలా ఈయడం మీలాంటి తల్లి దండ్రులు నేర్పిందే.. ఏం కమలకి కాలొంకరా, కన్నొంకరా, డబ్బిచ్చి మొగుడ్ని కొనుక్కోడానికి?.. మీలాంటి తల్లితండ్రు లందరూ ఒకమాటమీద నిలబడి కట్నాలు ఈయం అని గట్టిగా నిశ్చయించుకుంటే పుచ్చుకునేవాళ్లెలా పుచ్చుకుంటారు? దేశంలో మగవాళ్ళందరూ ఎన్నేళ్ళు పెళ్ళిమానేసి కూర్చుంటారు.? ఎవరూ ఈయకపోతే తమ మొగపిల్లలకి పెళ్ళి చేయకుండా వదిలేయరుగా తల్లిదండ్రులు. అలా ఒక నిర్ణయం పిల్లల తల్లితండ్రులు ఎందుకు చేసుకోకూడదు....?

"ఆ..ఆ..ఈకబుర్లు చెప్పేందుకు మహా బాగుంటాయి... ఆచరణలో ఎవరూ పెట్టరు. పెద్ద ఆదర్శాలు, ఆశయాలు నూటికి కోటికి నీలాంటి వాడొకడు వస్తే సరిపోదు....."

"ఒరేయ్ ..పెద్ద కబుర్లు చాలుగాని.. పెద్దవాళ్ళమాట విను, నీ వొకడివి పుచ్చుకోనంతమాత్రాన ఈ గొడవలు తీరేవికాదు కాని... నామాటవిని అనవసరంగా గొడవలు పెట్టకు.. నిక్షేపంలా అందరూ ఇరవయ్యేసి వేలు తీసుకుంటుంటే నీకేం ఖర్మరా ఇది. ఎవరిదాకనో ఎందుకు, మీ బావ చదువుకున్నవాడు, అతను తీసుకోలేదూ..." జానకమ్మ కొడుక్కి నచ్చచెపుతూ అంది.

"బావలా నేనమ్ముడు పోలేను..అతని బుద్ధి గడ్డి తింటే నాది తినాలనిలేదు." తిరస్కారంగా అన్నాడు రామం.

పురిటికి వున్న కమల అంతా వింటూ అక్కడే వుంది. మొగుడ్ని అనేసరికి కమలకి చర్రుమని కోపం వచ్చేసింది "మహా బుద్ధి వున్నవాడివి నీవొక్కడివి బయలు దేరావులే.. ఇష్టం వచ్చినట్టు మాట్లాడకు" అంది.

"తప్పకుండా అంటాను. చదువుకుని కూడా ఆమాత్రం బుద్ధిలేకపోతే అంటాను ఆరేడు వందలు ఆర్జించుకుంటున్నవాడు.. ఈ అత్తవారిచ్చే కట్నం లేకపోతే గడవదా అతనికి, ఆడబ్బుకి కక్కుర్తి పడాల్సిన అవసరం ఏమిటి?.. ఇలాంటివాళ్ళున్నంత వరకు మనగతి ఇంతే. .."

"పెద్ద ఆదర్శ పురుషుడివి నీవొక్కడివే వున్నట్టు మాట్లాడకు.. ఆయన నీలా తల్లితండ్రులని వాళ్ళకర్మానికి వదిలేసే రకంకాదు. ఆకట్నం ఆయన కోసంతీసుకున్నారేమిటి? ఆయన చెల్లెళ్ళని నీలా అలా పట్టనట్టు వదిలేసే రకంకాదు..!" కోపంగా సమర్థిస్తూ అంది కమల.

"ఆ...పెద్ద బయలుదేరాడు తల్లి తండ్రులని ఉద్ధరించే మనిషి..కాకులనికొట్టి గద్దలకు వేసినట్టు ఇటు పుచ్చుకుని అటు ఈయడం అందరూ చేయగలరు... అంత చెల్లెళ్ళమీద ప్రేమవుంటే సంపాదిస్తున్నాడు సగం జీతం దాచి చెల్లెలిపెళ్ళి చేయాల్సింది. అసలు తను పుచ్చుకోడం ఎందుకు, చెల్లెలుకీయడం ఎందుకు! ప్రతి ఇంట్లోనూ ఈయం, పుచ్చుకోం అని నిర్ణయం చేసుకుంటే ఈ గొడవే వుండదుగా......'

'ఏదోలే నాయనా, నీపాటి బుద్ధిలేక.. ఏదో నీవిలా పెద్ద కబుర్లు చెప్పినంత మాత్రాన లోకం మారిపోతుందని భ్రమపడకు.....' హేళనగా అంది కమల.

"నిజమే..నేను ఒక్కడిని చేస్తే సరిపోదనే నేననేది! నాలాంటి వాళ్ళందరూ చెప్పాలనే అంటున్నాను.." కమల మళ్ళీ ఏదో అనబోయింది.

"ఒసే వూరుకో, వాడితో నీకెందుకు వాదన....' జానకమ్మ అంది.

"ఎందుకొచ్చిన శుష్క ప్రసంగాలు.మనం వాడినించి ఏం ఆశించకూడదని ముందే చెప్పేశాడుగా, ఇంకా ఎందుకొచ్చిన మాటలు? కొడుకు వున్నా లేడనుకుని నా తిప్పలు నేను పడతాను...' తీవ్రంగా అంటూ కొడుకువంక తిరస్కారంనిండిన చూపు ఒకటి విసిరి లోపలి గదిలోకి వెళ్ళిపోయారు ఆయన.

భర్త వెళ్ళాక కొడుక్కి నెమ్మదిగా నచ్చచెప్ప బూనుకుంది జానకమ్మ. 'ఒరేయ్ నాయనా, అనవసరంగా మీ నాన్నగారిని బాధపెట్టకు, దమ్మిడి ఏగాని కాదు ఆయనెక్కడనించి తెస్తారు చెప్పు....నీ ఇష్టంవచ్చిన పిల్లనే పెళ్ళాడు కాదనం..

కానీ కట్నం వద్దనకు....'

రామం అదోలా నవ్వాడు.. 'అమ్మా రాధ నాన్నగారు పదిహేను వేలు కాదు కదా, పదిహేనువందలు కూడా యీయలేని స్థితిలో వున్నారు...స్కూలు మేష్టరు..రాధ కాక మరో నలుగురున్నారు..రాధ ఏదో తెలివైంది కనక స్కాలర్‌షిప్పులు వాటితో మెడిసన్ చదవగలుగుతూంది. ...'

'పోనీ యీ రాధ కాకపోతే మరొకర్తి దొరకదా ఏమిటి నీకు, అంత లేని ఇంటి పిల్లని చేసుకోడానికి నీకేం ఖర్మొచ్చింది.. మంచి మంచి సంబంధాలు ఎన్నో వస్తున్నాయి....ఈ పిల్లని మించిన వాళ్ళెందరో వుంటారు...'

"వుండచ్చు..కాని నేను రాధని చేసుకోడానికి నిర్ణయించుకున్నాను. ఆ అమ్మాయికి మాటిచ్చేశాను కూడా....' మొండిగా అన్నాడు రామం.

"అంతేనన్నమాట.....కన్నవాళ్ళు చెప్పే మాట వినవన్నమాట, నీ గొడవ నీదే తప్ప పెంచి పెద్ద చేసిన వాళ్ళ బాధ నీ కక్కరలేదన్నమాట...."

"అమ్మా....నన్నెందుకు అర్థం చేసికోరు మీరు....యీ కట్నాలవల్ల ఎన్ని కుటుంబాలు నలిగిపోతున్నాయో, ఎందరాడపిల్లలు కన్యలుగా మిగిలిపోతున్నారో చూస్తూనే మళ్ళీ మళ్ళీ మనమూ అదే

## కుక్క—తోక

త్రోవలో నడవడం....ఎన్నాళ్ళకి యీ సమస్య తెగుతుందమ్మా....వో మంచి పని చేద్దామనుకునే నా ఉద్దేశాన్ని మీరందరూ ప్రోత్సహించడం అటుంచి....యీ గొడవేవిటమ్మా....' విసుగ్గా అన్నాడు రామం.

"అవును నీకు గొడవగానే ఉంటుంది. మీ నాన్నగారి అవస్థ నీ కెలా తెలుస్తుంది' నిష్ఠూరంగా అంది జానకమ్మ.

"అమ్మా, కావలిస్తే ఆ అప్పు నెమ్మదిగా కొంత కొంత తీర్చచ్చు, నేనూ ఉద్యోగంలో ప్రవేశించానుగదా, దానికోసం కట్నం తీసుకోమని మాత్రం మళ్ళీ చెప్పద్దు...ఇదే ఆఖరిసారి చెప్పడం' నిష్కర్షగా చెప్పేశాడు.

నిస్పృహయంగా చూసింది జానకమ్మ... 'అంతేనంటావు.... కట్నం లేకపోతే పీడ పోయింది....కనీసం లాంఛనాలేనా జరిపిస్తారా....అదీ లేదా?'' చివరి ఆశ, కోరికైనా తీరుతుందో లేదో అన్నట్టు ఆరాటంగా అడిగిందావిడ.

రామం అదోలా నవ్వాడు "ఇందాకే చెప్పాగా, రాధ నాన్నగారు పదిహేను వందలన్నా ఖర్చుపెట్టలేరని....."

"ఇదెక్కడి విడ్డూరంరా....అత్తగారి ఆడపడుచుల లాంఛనాలేనా లేని పెళ్ళేమిటిరా, ఇంతకంటె లేని వాళ్ళయినా లాంఛనాలు జరిపిస్తారు....వీళ్ళు నిన్ను బాగా వలలో వేసుకున్నారు....నీ అలుసు కనిపెట్టి దమ్మిడీ ఖర్చు లేకుండా కూతుర్ని అంటగట్టేయడానికి బాగానే ఎత్తేసారు.... వాళ్ళ బుట్టలో పడ్డావు నీవు...ఇంక వాళ్ళెందుకు ఖర్చు పెడతారు'...కోపంగా మొహం ఎర్ర పరుచుకుంది జానకమ్మ.

"అమ్మా....ఈ లాంఛనాలు.... యీ ఛాదస్తాలు ఏమిటమ్మా యింకా....ఇవన్నీ తీసుకోడం కట్నం తీసుకోడంకంటె ఏం తీసిపోతుంది?....వాళ్ళిచ్చే వో చీర, ఓ నూరు రూపాయలతో నీకు రోజు గడిచి...'

"మనకు లేదనా తీసుకోడం, అదో వేడుక, సరదా....అంతే గానీ...."


"నిజంగా చూస్తే మన యీ వేడుకలన్నీ ఎంత అర్థంలేనివో అనిపిస్తుంది...మన తెలుగువాళ్ల ఆచారాలు, వేడుకలు అన్నీ.. ఎవరికీ ఉపయోగపడేలా వుండవు. ఉత్తరాదివాళ్లయితే కట్నాలు ఈయరు, పిల్ల పెళ్ళి అయితే వాళ్ళింటికి కావల్సిన సామాను లన్నీ కానుకలుగా క్రొత్త కాపురానికి దేనికి లోటు లేకుండా యిచ్చి పంపుతారు. మనవాళ్ళలో కట్నాలు కానుకలు అన్నీ మధ్యవాళ్ళు తినడంతప్ప అసలు వాళ్ళకి ఏం వుండవు.....ఎంత డబ్బు తీసుకున్నా కొత్త సంసారానికి పెళ్లి కొడుక్కి పెళ్లి కూతురికి ఏం వుండవు....లాంఛనాలనడం, పానకం బిందెలు, చెంబులు, బట్టలు అనడం అందరూ పంచుకోడంతప్ప, వధూవరులకి ఏం ఉంటాయి?....కట్నంతీసుకోడం కొడుకుపేర, ఆ కొడుక్కి ఏంవుండవు."....

తీవ్రంగా విమర్శిస్తూ అన్నాడు రామం. జానకమ్మకి పూర్తిగా కోపం వచ్చేసింది.

"పోన్లె నాయనా, మే మందరం మధ్యవాళ్ళం....హు కన్నతల్లి, తోబుట్టువులు.. మధ్యవాళ్ళట!.....మేం తింటామన్న బాధ నీ కెందుకులే నాయనా వాళ్ళియనంత మాత్రాన మాకేం చీరలకి లోటు రాదులే..'' కఠినంగా అంది.

"కోపం ఎందుకమ్మా, నీ వంటేనీవే గాదు, మన తెలుగు వారిమాట చెప్తున్నాను అంతే....."

"నీ యిష్టం వచ్చినట్టు చేసుకోరా. ఇంక మాట్లాడితే వట్టు...ఏదో బుద్ధి



లేక, మనసొండపెట్టక...ాకన్నాం కనక వూా కేవో ఆశలుంటాయి గనక అన్నాను.... నీ యిష్టం వచ్చినదాన్ని.... నీ యిష్టం వచ్చి నట్టే చేసుకో......నీ జోలికివస్తే చెప్పుతో కొడుదుగాని...." విసురుగా లేచి వెళ్ళిపోయింది జానకమ్మ. మొహం ముడుచుకుంటూ కమల కూడా లోపలికి వెళ్ళిపోయింది.

ఒంటరిగా మిగిలిపోయిన రామం తనని అర్థం చేసికోలేని వారికి ఎలా నచ్చచెప్పాలో తెలియక నిస్సహాయంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

* * *


రామం ఆఖరికి అన్నమాటమీాదే నిలబడి రాధని పెళ్ళి చేసుకున్నాడు, ఎవరి కోపాలు శాపాలూ లెక్క చేయకుండా.

పది రూపాయల ఖర్చుతో గుళ్ళో దేవుడి ఎదుట మిత్రుల సమక్షంలో రాధ మెడలో మంగళసూత్రం కట్టేశాడు. పెళ్ళికి సూర్యనారాయణగారుగాని జానకమ్మగాని రాలేదు. రాధ తల్లితండ్రులు స్వయంగా వెళ్ళి ఆహ్వానించినా, రామం ఎన్నిసార్లు చెప్పినా ఆఖరికి పెళ్ళికి వాళ్ళిద్దరూ రానేలేదు. అంతేకాక రాధ తల్లితండ్రులు పిలవడానికి వెడితే వాళ్ళతో నిష్ఠూరంగా మాట్లాడి అవమానించారని విన్నాడు రామం. తల్లి తండ్రులు రాకుండానే పెళ్ళి జరిగినా తన కర్తవ్యంగా ఎంచి రాధని వెంటబెట్టుకుని తల్లిదండ్రులకి నమస్కారం చేయడానికి వెడితే ఆ ఇంటో వారెగాక, యింటి తలుపులు కూడా స్వాగతం చెప్పలేదు. రెండు మూడుసార్లు పిలిచినా తలుపులు తెరవబడలేదు. రామానికి పట్టరాని కోపం వచ్చింది. కాసేపాలో చించి రాధని తీసుకుని ఆ యింటి గుమ్మం శాశ్వతంగా దిగిపోయాడు.

రెండు మూడు రోజుల తర్వాత వచ్చిన రిజిస్టర్ ఉత్తరం -ఆశ్చర్యంగా అందుకున్నారు సూర్యనారాయణగారు. రామం నించి అని తెల్సుకొన్నాక కాస్త ఆరాటం హెచ్చింది.

'మీాకు కొడుకుకంటె కొడుకు సుఖం కంటె కొడుకువల్ల వచ్చే డబ్బే ముఖ్యమని తేలింది. మీారు ఆశించిన ఆ డబ్బు యీ ఉత్తరం ద్వారా పంపుతున్నాను.

నన్ను కని పెంచి చదువు చెప్పించి







డిస్ట్రిబ్యూటర్లు: గుంటూరు, ఒంగోలు జిల్లాలకు
1. మీర్జా ఖలీయుల్లాబేగ్, మాచర్లపురం
2. శ్రీ ఏజన్సీస్, చీరాల

నందుకు ప్రతిఫలంగా నానించి పదిహేను వేల రూపాయలు మీరు ఆశించారు. పెళ్ళి బజారులో నా వెల పదిహేనువేలని నిర్ణయించి నా ధర కట్టారు.

రాధ తండ్రి మీరు కోరిన డబ్బు ఇచ్చే శక్తిలేనివాడవడంవల్ల వారి అమ్మాయి రాధ ఉద్యోగస్థురాలు కనక ఆమే స్వయంగా నన్ను కొనుక్కొని ఆ డబ్బు మీకు యిస్తూంది. పదిహేను వేలు ఒక్కసారి యిచ్చే శక్తి ఆమెకి లేనందున నెలకి మూడు వందలు చొప్పున మీకు చెల్లించడానికి పదిహేను వేలకి ప్రో నోటురాసి యిందులో జత పరచినది. మీరు చూడగలరు. ఆలస్యానికి అయే వడ్డీ కూడా ఆమె చెల్లిస్తుంది. మొదటి వాయిదాగా మూడు వందలకి చెక్కు పంపుతూంది ఇందులో. ఈ పద్ధతివల్ల

# కుక్కతోక

మీకు జరిగే యిబ్బందికి ఆమె విచారిస్తున్నది.

పాడి ఆవుని మరొకరికి అమ్ముకున్నాక ఆ ఆవు పాడిని ఆశించకూడదన్న సంగతి మీకు తెలియనిది కాదు! అలా ఆశిస్తే అది వారి తెలివిహీనతని మాత్రం చాటుతుంది!

అమ్ముడు పోయిన మనిషి అంతే! ఈ రోజునించి నేను సూర్యనారాయణగారికొడుకు కానని, కేవలం రాధ మొగుడనని గుర్తించ గలరు.

ఇట్లు, "రాధమ్మ మొగుడు"

ఉత్తరం చదివి లోపల కాస్త గాభరా పడ్డా అది పైకి కనపడనీయకుండా భార్య వంక తిరిగి "చేసేశావా; దెబ్బకి దయ్యం కూడా జడుస్తుందంటారు. మనం పెళ్ళికి వెళ్ళకపోగానే, యింట్లోకి రానీయకపోయే సరికి అబ్బాయిగారు దారికొచ్చారు. మరి లాభంలేదని గ్రహించి డబ్బు పంపించాడు. ఇదేదో ముందే ఏడవకూడదూ, పెద్ద గొప్ప కబుర్లు చెప్పకపోతే....నే చెప్పలేదూ, మనం కాస్త బింకంగావుంటే వాడే దారికి వస్తాడని....' కాస్త గర్వంగా అన్నారు సూర్యనారాయణగారు.

"బాగానే వుంది....కాని ఆ ఉత్తరం ఏమిటి అలా రాశాడు?"

"ఆ....మనల్ని కాస్త బదరద్దామను కున్నాడులే....అంతే. అంతకంటే ఇంకేం వుంది....ఉత్తరంలో రెండు లైన్లు రాసి నంత మాత్రాన వాడు మన కొడుకు కాక పోడు!....అమ్ముడు పోవడం ఏమిటి, వాడి మొహం, కట్నాలు తీసుకున్న అందరూ అమ్ముడు పోయినట్లేమిటి? ఏదో వేడిలో వున్నాడు. నాలుగు రోజులుపోతే వాడే దారికి వస్తాడు...." వోటమిని వప్పుకోక కుహా నిబ్బరంగా నమ్మకంగా అన్నారాయన.

"నిక్షేపంలా ముందే యిదేదో చేస్తే యింత గొడవే జరగకపోను....లక్షణంగా పెళ్ళి జరిగేది....ఆదర్శాలు, ఆశయాలు వల్లించి లక్షణంగా జరగాల్సిన పెళ్ళి దిక్కూ మొక్కూలేని వాడిలా పెళ్ళి చేసు కున్నాడు.' కాస్త బాధగా అంది జానకమ్మ. 'డబ్బు యివ్వాయక తప్పలేదు ఎలాగో. ఏ ముద్దు ముచ్చట్లు జరగకుండా అయింది, ఏం పిల్లలో...'

"పోన్లే...రెండో కొడుకు పెళ్ళిలో ని ముచ్చట్లు తీర్చుకుందువుగానిలే ఈ పెళ్ళిది కూడా కలిపి లాంఛనాలు ఏకంగా అప్పుడు లాగుదువుగానిలే...'నవ్వా రాయన.

"ఆ....ఈ పెళ్ళికి యివ్వి జరిగాయి....ఆ పెళ్ళికి ఇస్తారు యింక!" పైకి అలా అన్నా ఏ ఏడెనిమిదేళ్ళ తర్వాతో జరిగే రెండో కొడుకు పెళ్ళిలో పుచ్చుకునే కట్నం.... జరిపించుకోవాల్సిన లాంఛనాలు అన్నీ ఆవిడ కళ్ళముందు అప్పుడే కదలాడడం ఆరంభించాయి!!

